స్కెచ్

# అజపిలాపం

ఎ. ఎల్. ఎన్. సోమయాజులు

"మట్టితో తయారైన శరీరం కాలి మట్టిలో కలిసిపోయింది. పంచభూతాల పాళ్లు పంచభూతాల్లో కలిసిపోయేయి. విరిగి శిథిలమైన పంజరంలోంచి చిలుకవలె ఆత్మ యెక్కడికో యెగిరిపోయింది. ఇదే యీ మానవజీవిత సమాప్త సంసూచన. ఇన్నాళ్లూ మృదుమధురంగా గడిపిన భవయాత్రకు ప్రగతి. అంతం...అబ్బ! జీవితం లోతు యిప్పుడుగదా అర్థమవుతో!" మడతకుర్చీలో పండుకొని రంగారావు ఆలోచనా సముద్రంలో మునిగిపోయాడు.

కాని ఆ మరపు క్షణికం. తన చిన్నతనంలో పిన్న ఆటలలో ఏ మధురస్మృతులను యౌవనమున నుంటాయని కలలుగన్నాడో, దేనికోరకై అమందానందం అనుభవించాడో, ఆ యౌవనపు నీడలు ప్రస్తుతం కంటకావృతమైన కడలిచాటలోని నీడల్లా కనుపిస్తున్నయ్. ఆ ఆలోచనలిప్పుడు కంచులా కరిగి మంచులా మాయమయ్యాయేమో? అతనిప్పుడు ఆలోచించడం మొదలుపెడితే ఒక్కసారి గతంలోకి గంతేసి మరుక్షణంలో సుదూర భవితవ్య గగనాని కెగురుతుంది. కాని వర్తమానం మాత్రమే అతనిలో కోపాన్ని, రోషాన్ని కలుగ చేసేది—ఎవరి యాత్ర ఎంతలో ముగుస్తుందో ఎవ్వరికీ తెలియదు. అదే అగోచర పదార్థంయొక్క పరమ రహస్యం.

ఎదురుగా సుందరి తన మనోవ్యవస్థను గూర్చి పరిహసిస్తూన్నట్లు కలలుగంటాడు. తన మనస్సులోని తడి ఆడిపోయింది. నీడలు చూమకోడానికి సిద్ధంగావుంది. అదెగో! ముఖపద్మముపై చిరునవ్వు చెక్కుచెదర్లేదే. గతాన్ని గురించి ఆలోచనలో పడ్డాడురావు. "ఆమె భౌతికంగా తన యెదుట లేదుగాని నిశితంగా పరిశీలిస్తే ప్రతి అణువు ఆమెను హత్తుకునే ఉంది. మనస్సు ఆమెనుండి ఎడిపడనంటోంది. అంతరాత్మ ప్రణయపులకిత అయింది. ఆవి మరుద్దామన్నా మరపురావడం లేదే..."రావు శరీరం జలదరించి, ఇంతలో ఉయ్యాలలోని పిల్లాడు "క్యేర్" మన్నాడు ఆ పసివాడు ఆమె అంశమేకదా! రావు వెళ్ళి పసిబాలుణ్ణి హృదయానికి హత్తుకున్నాడు. తానెవరి కోరకు బ్రతకాలి, తన బ్రతుకు నాశనమై పోయింది. పుష్పం వాడిపోయి రాలిపోయింది. తుమ్మెద యింక మధువెచ్చట త్రాగుతుంది? కాని—

* * *

"హృదయాన్ని చిక్కబట్టాలిగాని జీల్ల్నై పోతావేమిత్రా! అబ్బే! నీ సంగతేం బాగులేదు" అన్నాడు ప్రాణమిత్రుడు రాజా. ఎలాగ హృదయాన్ని చిక్కబట్టాలి? ఇంత దగా యెక్కడేనా ఉందా? తన జీవితంలో కలసి తన జీవితయాత్రలో నిమిషనిమిషానికీ పన్నీరుతో హాస్యాన్ని నింపి నాలుగేండ్లపాటు ప్రపంచాన్ని మరపించిన సుందరి విగ్రహము నేడుకళ్లెదుటనుంచి పొమ్మంటే ఎలా పోతుంది? ఇంకా ధైర్యం ఏమిటి? అతని హృదయంలో దుఃఖం ఏరులుకట్టి కన్నీటిస్రవంతిగా ప్రవహించింది. ఇప్పుడు కన్నీటి తడిలేదు...ఆరిపోయింది. అతనిప్పుడు మోడువారిన వృక్షం. అతనిజీవిత సముద్రపు మథనంలో అమృతం పుడుతుందని కలలుకన్నాడు. కాని నేడు హాలాహాలమే పుట్టింది. లోకం అతనికి చిన్నవయస్సులో తండ్రి పెదవులమీదుగా సలహా నిచ్చింది. జీవితం ఎద్దుబండివంటిదేనని, హృదయము సుఖదుఃఖాలను సరిసమానంగా పంచుకోవాలని". ఆమాట లిప్పుడు స్మృతిలో గతుక్కుమన్నాయ్. ఆ మాటలన్నప్పుడు అలక్ష్యంగా ఉదాసీనతతో విన్నాడు. కాని యీ సత్యం జీవితంలో యిప్పుడు ఎరుకపడింది. దేవుడు తన కిచ్చిన హృదయం యీ వైపరీత్యం మూలాన్న బండరాయి అయిపోయింది...ఛీ! బండరాయి ఏపాటి గట్టిగా సుత్తితో కొడితే పిండయిపోతుంది. వజ్రఘాతాల్లాంటి కష్టాలువచ్చినా నిభాయించుకు తిరిగేవ్యక్తు లెంతమందున్నారో లోకంలో... పాడులోకం! తనీలోకంలో ఎందుకు పుట్టాడో? తన భార్య యీ లోకాన్ని విడిచిపోయేటప్పుడు

తనమనస్సు తనలోలేదు. కొయ్యబారిపోతున్నాడు తను ఆ విషయాన్ని తల్చుకుంటే. చంటాణ్ణి హృదయంలో చేర్చుకుని తిరిగి కవోష్ణ భాష్పాలు రాలుస్తూ తనచేతి కందించింది. పిదప శాశ్వత నిద్రే—చంటాణ్ణి కనురెప్పలా కాయాలి. వాడి పసిహృదయాని కాఘాతం కలుగ నివ్వకూడదు ఏమయినా సరే! ఇది అతని తుదినిశ్చయం.

ఈ లోకంలో ఎంతమంది జీవుల్ని తన చేతులతో తను బ్రతికించాడు. ఎన్నయినా ఏం లాభం! తను కట్టుకున్న భార్యని తన హృదయ పీఠాన్ని అధిష్ఠించిన రాణిని తన జీవిత శకటంలో రెండవచక్రంగా అమర్పబడిన సుందరిని. తను ఘనవైద్యుడైయుండియు బ్రతికించుకొనలేక పోయాడు. ఎద్దుబండి నడుస్తోంది గమ్యసాధనకు కాని కాలగతిలో సీల విరిగిపోయింది. చక్రాలు చెరొకవైపూ చెదరిపోయాయి. బండి రోడ్డుమధ్య కుప్పలా కూలిపోయింది. లక్ష్యాన్ని సాధించలేక, గమ్యసానాన్ని చేరుకోలేక ...

* * *

రాజా అన్న మాటలు జ్ఞాపకానికివచ్చి వెకిలిగా చిన్ననవ్వు నవ్వేశాడు...రావు. "నన్నొక యింటి వాణ్ణి చేస్తాడట!" హుం! యింటివాడు! తిరిగి హేళనగా గళరవంచేసి పెదవులు విరిచాడు.

నీళ్లుపోసుకోడానికి వెళ్లినప్పుడు సబ్బుడబ్బీ తువ్వాలు పట్టుకొని యెవరో వెనుకవచ్చినట్లూ, భోజనంచేసి ఆఫీసుబట్టలు వేసుకుంటుంటే చీల్చిన తమలపాకులందివ్వడంలో గాజులసవ్వడి వినపడి నట్లూ, తలంటి పోసుకుంటుంటే తన శరీరంమీద గండుచేపలవంటి చూపులు ప్రాకుతున్నట్లు, అనుభూతిని పొందుతూ, వెంటనే అది భ్రమఅని తెలిసి, జీవితం ఎంత మాయనాటకం? అనిపించే దతనికి. ఎంతమాయనాటకమైనా సమపాత్రలేక పోతే ఎంతకష్టం? సంభాషణలులేక జీవితనాటకమంతా స్వగతాలమయమైపోతే, ఆ బరువెత్తడం ఏ మానవుడితరం? ఈ ఆలోచన తట్టగనే అతని గుండె అశ్రుభారంతో కుంగిపోయేది.

అతడు తరచు యీ ఆలోచనల్లో మునిగి తేలుతూ బహిఃప్రపంచాన్ని మరచేవాడు. అలాంటి సమయాల్లో అతనినేదో ప్రస్తావనలోకి దింపి మనోవేదన నుపశమింపజేయచూచేవాడు రాజా.

"ఎన్నాళ్ళు దిగులుపడతావునాయనా! నీకేం లోటు? నువ్వు సమ్మతిచూపిస్తే వందలకువందలు సంబంధాలొస్తాయి. ఒక యింటివాడవై వంశం నిలబెట్టడం విధి."

లోటులేకపోవడమేమిటి? జీవితంలో తీరని కష్టం కలిగింది. భరింపరాని అఘాతం కలిగింది. అవును! సుందరి మధురస్మృతులను మననంచేసుకుంది. తనంటే ఎంత ప్రేమ? పుట్టింటినుంచి తిరిగివచ్చినప్పుడు మరీ అందంగా కనిపించింది. నిజంగా అప్పుడు తను సంతోష సముద్రంలో తేలిపోయేడు తెరచాపలెత్తుకుంటూ. కాల తరంగం సుందరిని "కన్య"నుంచీ కళ్యాణ కుంకుమ దాల్చిన "కాంత"గా పరివర్తన నిచ్చింది. కాని యిప్పుడు రంగంనుంచి ఒక్కసారిగా నిష్క్రమింపచేసింది. కాలవైపరీత్యం అంటే యిదే.

తనకు భార్యతో కాపురంచేసే అదృష్టం పోయింది. తనొకటి తలిస్తే దైవమొకటి తలచాడు. నిజమే, దేవుడు సంతోషంగా జీవితాన్ని గడుపుతూన్నవాళ్లనుచూచి సహించలేడు. మర్త్యలోకంలో స్వర్గాన్ని స్థాపిస్తే దాన్ని కూలద్రోసేను మాయభగవంతుడు. దేవుడు విశాల హృదయుడంటారే మరి అతని హృదయంలో అంతమాత్సర్యం ఉంటనే అని అనుకునేవాడు పాపం రంగారావు. "పెరుగుట విరుగుటకొరకే" అన్న సామెత ఆ సంతోషతరంగాల్లో జీవిత నావపై ప్రయాణంచేస్తూ మరచిపోయాడు. సుఖదుఃఖాలు, సంతోషసంతాపాలు, వెలుగు చీకట్లు, తెలుపు నలుపు పూసలవలె । జీవితమనే దారానికి బంధింపబడి ఉంటాయి; మామూలు పూసలదండవలె దీన్నిఛేదించి నల్లపూసల్ని పారేసి తెల్లపూసల్ని అట్టే పెట్టుకుందామనుకున్నాడు. కాని యీ పూసలదండని ఛేదించడానికి గల శక్తి, త్రాణ ఎవరికి (మానవమాత్రుడన్నవాడికి) ఉండదన్న సంగతిగ్రహించలేదేమో! యిప్పుడు అర్థమౌతోంది జీవితం అంటే ఏమిటో.

తనని నరకకూపంలోకి తోసేసి సుందరి స్వర్గధామంలో ఆడుకుంటూంది. ఆమెమాత్రం తనను విడచి మరోలోకంలో ఉండగలదా! ఉండమని కట్టడిచేస్తే ఏం చేస్తుంది? ఆ స్వర్గం ఆమెకు నరకంగానే ఉంటుంది. తనకోసం ఆ పూలబాటలో ఎదురు చూస్తోంటుంది. ఈ జీవితయాత్రలో

సుందరివంటి సహ ప్రయాణీకురాలు లభిస్తుందా? కల్లమాట. జన్మజన్మాలకి లభించదు. ఇంకొక ప్రయాణీకురాలితో స్నేహం చెయ్యడమెలా? తను ఎలా ఉదాసీనంగా ఉండగలడు? అగ్ని నీడలలో, పవిత్ర మంత్రోచ్చారణలో తన వివాహం ముగిసింది. దానిని తలచుకుంటున్న కొద్దీ దుర్భరబాధావేశం అతనిని చుట్టుకుంది. గడచిన జీవిత ఛాయాచిత్రం అతని కళ్ళముందు కదలాడుతోంది.

సుందరి దహనఘట్టం అకస్మాత్తుగా కళ్ళల్లో కదిలింది. అక్కడే అప్పుడు ఎర్రటి అగ్నిజ్వాలలు సుందరదేహాన్ని చుట్టూకాయి. సుందరి భస్మావశేషందాల్చిన దారుణ స్థితి...ఆమె కన్నీటి చుక్కలు ఎంతవ్యధానిలాన్ని నింపుతున్నాయి. నాడు వృక్షశాఖలకింద లేచిన నివురుగప్పిన నిప్పు తునకలని కన్నీటి చిల్కరింపుతో సమసిపోజేసి ఆ భస్మంలో తనొక కొత్తమొక్కను విత్తుకోవాలా? తనవల్ల కాదు...కాదు...కాదు...తన భవస్మృతులిప్పుడు తీరని బాధావిఘాతాలలో మరుగుపడేవి. అచేతంగా...అప్రయత్నంగా... "నేను పెళ్ళిచేసుకోను! నాచంటిపాపను లోకంలో ఒక సార్థకజీవిగా చేయడమే నా కర్తవ్యం!" అని అరిచాడు. ఆ అరుపులకి ఉయ్యాలలోని కుర్రాడు కెవ్‌మన్నాడు.

"ఆచార్య దేవో భవ"

# ఉత్తరప్రదేశ్ బడిపంతుళ్ళ గోడు

జాగ్రఫీపుస్తకంచూస్తే, లక్నోలో చూడవలసిన అద్భుతాల్లో యు. పి. సివిల్ సెక్రెటరియట్, ఒకటిగా కనబడుతుంది. కాని ప్రస్తుత పరిస్థితుల్లో, యాత్రికులుగా పోయేవారు యీ భవనప్రాంతాలకి పోకుండా వుండడమే మంచిది. ఇది యిప్పట్లో అద్భుతంగా లేకపోవడమే కాక, ఒక రకహో వికృత కూడా దాన్ని ఆవరించుకుంది. పనిలోమునిగి హడావిడిగా తిరిగే పోలీసులూ, వారి గుడారాలూ-దీనికి కారణం. ఇదిచూస్తే, యింకా ఉత్తరప్రదేశ్‌లో కలంకంటే కత్తికేబలం ఎక్కువ అని తెలుస్తుంది. భవన ప్రాంగణంలో యథాలాపంగా తిరిగేవ్యక్తి ప్రైమరీస్కూలు టీచరేమో! పోలీసులు తమపనితాము నిర్వర్తిస్తే? ఏమో ఎవరుచెప్పగలరు? నిపుణతా, నిజాయితీలకి రూపమే యీ పోలీసు శక్తి. టీచర్లు అనవసరంగా చట్టవ్యతిరేకమైన అఘాయిత్యాలకి దిగకుండా ఆవరణలోని "ప్రొహిబిటెడ్" ప్రాంగణంలో ప్రవేశించగానే హద్దుమీరి ప్రవేశించినందుకు ఎరెస్టుచేసి తీసుకుపోతున్నారు పోలీసులు.

రాష్ట్రంలో వివిధప్రాంతాలకి చెందిన బోర్డు స్కూలు టీచర్లు ఓగుంపుగా, ప్రతిసాయంత్రం సెక్రటేరియట్ చేరి, ప్రొహిబిటెడ్ ఏరియాలోకి హద్దుమీరి ప్రవేశించడం, దానితో పోలీసులు సునాయాసంగా వాళ్ళని ఎరెస్టు చెయ్యడం-ఇదీ ప్రస్తుతం యు. పి. లో జరుగుతున్నది. ఎంతో కాలంనుంచి కిక్కురమనకుండా బాధలనుభవిస్తూ ఎక్కడైతేకష్టాలున్నాయో అక్కడేపవిత్రతవుందనే వెర్రినమ్మకంతోవున్న ఈటీచర్లుతమవ్యక్తిగతశక్తికి మించినదే అయినా ధైర్యం కూడదీసుకుని ఐక్యకంఠంతో, తమకుజరిగే అన్యాయాన్ని ఎత్తి ప్రపంచానికి చాటితే తప్పులేదు. టీచర్లఅంతస్తుకి ఆందోళన అనేది విదేశీయం, అని కొందరు ఆశ్చర్యపడవచ్చు. కాని అసలు ఆశ్చర్యపడవలసింది- యీ ఖరీదైన రోజుల్లో, యు. పి. లో 80,000 ప్రైమరీస్కూలు టీచర్లూ వాళ్ళ కుటుంబాలతోసహా, ముప్ఫయి రూపాయలకి తక్కువగా వచ్చే తమజీతంలో ఎలా జీవితం సాగిస్తున్నారా అనేదాన్ని గురించి. ఈనాటి ప్రజాప్రభుత్వం యీ విషయంలో తనకి సంబంధము లేనట్టే వూరుకుంది.

ప్రప్రథమంగా జాతీయపతాకం 1947 ఆగస్టు 15న ఢిల్లీలో ఎగిరిననాడు, పూర్తి భోజనంలేని, నిండు గుడ్డలేని, చాలీచాలని జీతగాడు-ప్రాథమికపాఠశాల టీచరు కూడా అందరితోపాటు ఆనందించాడు- దేశం స్వాతంత్ర్యం సంపాదించుకున్నందుకు.స్వాతంత్ర్యసిద్ధితక్కువది కాదు. తనదగ్గర చదువుకొన్న వాళ్లలో కొందరు దేశపరిపాలనా కర్తలుగా, దారిచూపే దీపకళికలు అవడంచూచి ఆనందించడం కూడా తక్కువ విషయంకాదు.